




# గవర్నమెంటు గేదె

తోకోటి జగన్మోహనరావు

'తమరెప్పుడైనా గేదెలు పెంచారా? లేదా? మా ఇంటిదాని పోరువడలేక ఓ సారి ఈ గేదెలవ్యవహరంలో దిగి సాలా నష్టపోయానండి. మా మల్లేసుగాడు నన్ను నిలువునా ముంచేశాడండి !

మల్లేశంటే నాకు ఒరసకి బామ్మర్ది అవుతాడు - తెల్లని నిక్కరు, తెల్లసొక్కా మాయకుండా ఆడినీ, ఈడినీ కొట్టుకు తినేసి బతికేస్తాడు. అదేంటోనండి - ఆడి సంగతి తెల్సుండికూడా ఆడి బుట్టలో మాటిమాటికీ పడిపోతానండి.


ఓ రోజుపొద్దుటే అరుగుమీద కూర్చుని టీ తాగుతుంటే మల్లేసు గాడు 'ఏరా బావా' అంటూ వచ్చాడు.

'పొద్దుటే ఎవడి కొంప మునిగిందో - ఎక్కడికి బయల్దేరావు,' అనడిగాను. 'నీ కొంపకే', అని నవ్వుతూ, 'నువ్వు తాగడమేనా - నాకూ టీ నీళ్ళు పోసేదేవైనా ఉందా,' అన్నాడు.

ఈ లోగా మా యావిడ, 'అరుగెక్కి సెంబుతో సెంబుడు టీ తాగడమేగాని - మా యన్నొస్తే మర్యాద సెద్దావన్న గేనం కూడా లేదు మనిషికి అంటూ గ్లాసుతో టీ పట్టుకొచ్చింది ఆడికి.

'అదీ - అలాగెడ్డెట్టు బావకి', అంటూ జేబులోంచి రుమాలు తీసి, జాగ్రత్తగా మడతవిప్పి, అరుగుమీద పరచి, దానిమీద జాగ్రత్తగా కూర్చుని, గ్లాసు అందుకున్నాడు మల్లేశుగాడు. అందుకుని రెండుగుటకలేసి, 'టీ నీళ్ళంటే సెల్లెమ్మ నిజంగా నీళ్ళే తీసుకొచ్చినట్టుందే,' అన్నాడు - ఆవదం తాగినోడిలా మొహంపెట్టి.

'వల్లికు మీద గవుర్నరు



అమ్మమొగుడిలా బతికేసేవోడు - మీ యన్న కిల్లాంటి టీ నచ్చదు. ఇంకొంచెం పాలోసి తీసుకురాకపోయావా,' అన్నాను నేను వెటకారంగా.

'మరే - నువ్వు కొన్న గొడిగేదని రోజుకు రెండు కుంచాల పాలిస్తోంది కదా,' - అంతకంటే ఎటకారంగా అంది మాయావిడ.

సాలాకాలం నుంచీ మాయావిడ ఓ గేదెని కొనమని పోరెడుతోందిగాని ఇంతవరకు కొనడం పడనేలేదు - అందుకు ఆ ఎటకారమంతా.

కొంచెంసేవు మమ్మల్నిద్దర్నీ అలాఫైటింగు సెయ్యనిచ్చి, 'ఓ మంచి గేదుంది కొంటావేంటీ - సవకకూడా,' అన్నాడు మల్లేశుగాడు మెల్లగా.

'ఎంతేంటె?' అంది మాయాడిడ

'ఎంతా - అయిదారొందలవుద్ది'

అయిదారొందల్లో గేదె అనగానే మాయావిడ కళ్ళు మిలమిలలాడిపోయాయి. 'బాబ్బాబు - అది కాయంజేసి పెదుదూ - పిల్లలు నీ పేరు చెప్పుకుని మజ్జిగనీళ్ళయినా తాగుతారు,' అంది

'బావ నోరిప్పడులే,' అన్నాడు మల్లేశుగాడు నాకేసి తిరిగి.

'అయిదారొందల్లో గేదెవొస్తుంది - గాడిదొస్తుంది' అన్నాను నేను.

' అది తర్వాత కొనుక్కొని ఎక్కి ఊరేగుదువుగాని ముందు గేదెకొను,' అని నాతో అని, మల్లేశుగాడితో, 'మల్లేసన్నా - నువ్వే దగ్గరుండి బేరం కాయంజేసి గేదెని తోలించు - మీ బావ సంగతి నీకు తెల్సుకదా - లోకం తెలీని ఎఱ్రిమాలోకం' అని దేమేజింగుగా అంది మా యావిడ.

'నువ్వు ఏరే సెప్పాలా - నాకు తెలీదా సెల్లెమ్మా,' అంతకంటె దేమేజింగుగా అన్నాడు మల్లేశుగాడు.

'లోకం తెలీని ఎఱ్రిమాలోకాన్ని కాబట్టే లచ్మీదేవిలాంటి మా లచ్చినొదిలేసి నిన్ను చేసుకున్నాను,' అన్నాను నేను మాయావిడతో.

మాయానామాట విన్పించుకో నట్టు లోపలికెళ్ళిపోయింది. మల్లేశుగాడులేచి, జేబురుమాలు తీసి, దులిపి, జాగ్రత్త గా మడతపెట్టి నిక్కరు జేబులోపెట్టి, నాకేసి తిరిగి, 'ఏడంటికల్లా రెడీగుండ్రా బావా - పాలెవెల్దాం, 'అని వెళ్ళిపోయాడు.

ఈలోగా మాయావిడ పిడతల్లోనూ, డబ్బాల్లోనూ, పెట్టిలోనూ దాచిన డబ్బంతా పోగుచేసి ఆరొందలిచ్చింది.

'ఇంత డబ్బెక్కడిదే', అన్నాను నేను ఆశ్చర్యపోయి

'నీ మాలచ్మి ఇచ్చింది,' అంది అది గీర గా.

ఏడింటికల్లా మల్లేశుగాడు సైకిలేసుకొచ్చేశాడు. మాయావిడ ఎయ్యి జాగ్రత్తలు చెబుతుండగా వెళ్ళి సైకిలెక్కి కూర్చున్నాను,. వాడు పాలెం తీసుకెళ్ళి గేదెని సూపించాడండి.


'ఛ....ఛ... ఇదేం గేదెరా- ఇరవైరోజులు నిరాహారదీక్షచేసినట్టు సచ్చేలా వుంది.' అన్నాను.

'ఎవడిసావు ఎప్పుడు రాసిపెట్టుందో ఎలా తెలుస్తుంది - మన లక్కు అంతే - మనకిగేదెనమ్మినోడు ఇంకా బతికేవున్నాడు తెల్సా' 'అన్నాడు అడు.

'సచ్చిపోయే గేదె మాయన్న మాత్రం కొననిస్తాడా, 'అంది మాయావిడ వాళ్ళకి సపోర్టుగా. గేదె సచ్చినా పాలమీద భ్రమ ఇంకాపోక, 'ఇదిగో- ఈ గొలుసమ్మేసి ఈసారి మంచి గేదెని కొనుక్కురండి', అంది మాయావిడ మెళ్ళో గొలుసు తీసిఇస్తూ.

'ఈసారి పాలెంగేదె వద్దు - డైరెక్టుగా ఎడ్లబజారెల్లిపోదాంరా - ఒరే బావా ఎప్పుడైనా ఎడ్లబజారుకెళ్ళావురా? అనడిగాడు మల్లేశుగాడు.

'లేదు'




'అమ్మేవోణ్ణి చూడు - నలబైరోజులు నిరాహారదీక్ష చేసినోడిలా లేడూ - ఈ గేదెమ్మేసి అరపుట్టి పుల్లలు కొనుక్కుని తిన్నగా స్మశానానికెళ్ళిపోయి పేర్చుకుపడుకునేట్టున్నాడు - అడికే తిండిలేక పోతే గేదెకేం పెడతాడు? గేదెలో డిఫెక్టు లేదు - ఓ నెలరోజులు బాగామేపి సూడుఎలా ఉంటుందో - దాని పొదుగు సూశావా ? అన్నాడు మల్లేశుగాడు.

'పొదుగు పెద్దదిగానే వుందిరా,' అన్నాను నేను ఆశ్చర్యంగా.

'మరి తటపటాయించకు, ' అన్నాడు మల్లేశుగాడు.

ఆ గేదె ఆరొందలికి కొన్నాంసార్! మొదటి రోజు శేరు పాలిచ్చింది. రెండోరోజు తవుడూ, మూడోరోజుసోలెడు, నాల్గోరోజు గిద్దెడూ - అయిదోరోజున చచ్చిపోయిందండీ.

'ఒరే మల్లేసూ - ఇలాంటి గేదెని కొనిపెంచావేంట్రా, ' అన్నాను వాణ్ణి నిలేసి

'ఎడ్లబజారంటే మాయా బజారా బావా - అడుగుపెట్టగానే బేరగాళ్ళు నిన్ను చుట్టుముట్టేస్తారు. నీ సూపు దేనిమీదైనా నిల్సిందా - అది కొనిపించేదాకా వదల్రు. అళ్ళమాటల్లో పడిపోకు - జాగ్రత్త,' అని అడుసెబుతుంటే నాకు గాబరాపుట్టి, 'అదంతా నువ్వే సూసుకోరా బామ్మర్దీ,' అన్నాను నేను

ఎడ్లబజారులో పొద్దున్నుంచి మద్యాన్నందాకా ఈ గేదె కాదని ఆగేదనీ, ఆగేదె కాదని ఈగేదెని తిప్పి తిప్పి, సివరకి అడుదేన్ని కొనమంటే దాన్ని కొనేసే స్టేజికి నన్ను తీసుకొచ్చి - అప్పుడు చూపించాడు సార్ ఆ గేదెని.

సూడగానే కళ్ళు చెదిరిపోయాయంటే నమ్మండి. నూనె రాసారేమో - మదించిన ఏనుగులా నల్లగా నిగనిగలాడుతోంది. అది దున్నపోతయితే యమధర్మరాజుగారే దాన్ని తోలుకెల్లిపోయేవాడు - అంత క్లాసుగా వుందండీ గేదె.

'ఒకేబావా,' అన్నాడు మల్లేశుగాడు నన్ను ఓ కుదుపుకుదిపి.

నేనీ లోకంలోకి వచ్చి 'ఎంతుంటుందిరా మల్లేశూ' అన్నాను ఆశగా.

నేను అలా అడుగుతుండగా ఆ గేదె చుట్టూ మూగినోళ్ళలో ఒకడు, 'ఆకరిమాట - ఆపైది కాళీచేసి మూడు అయిదు తీసుకో,' అన్నాడు.

'ఎల్లెల్లవయ్యా - నాలుగంటే ఇవ్వలా - ఇంకా కాళీసెయ్యాలంట,' అన్నాడు గేదెనమ్మేవాడు.

'మూడు అరూ,' - ఇంకోడన్నాడు.

'ఓపైసా తగ్గను'

'కొంటే ఇలాంటి గేదే కొనాలెహ- సచ్చేగేదెలెందుకు,' అన్నాను రహస్యంగా మల్లేశుగాడి సెవిలో.

'నువ్వు కొంటానంటే బేరమాడదాం - అడు మనకు తెలుసున్నాడే,' అన్నాడు మల్లేశుగాడు నాసెవిలో

'సరే - సూడు ! అన్నాను.

ఎవడైనా ఆగేదెని ఏసుకుపోకముందే కొనేయాలనే ఆత్రతలో, అదంతా నన్ను గోతిలో దింపడానికి మల్లేశుగాడు చేసిన సెటప్పనే డౌటే రాలేదండి. నాకు ఆసమయంలో.

మల్లేశుగాడు కదలగానే ఆ డెనకాల మాయవిడ సెప్పిన ఎర్రి మాలోకంలా నేనుఫాలో అయ్యాను.

ఏంటీ మల్లేసుగారూ, ఇలా వచ్చారన్నాడాడు. మంచిదేదేమైనా వుంటే సూద్దామని - అన్నాడీడు. మీకా - అన్నాడాడు. నాక్కాదు - మా బావకి - కానీ నాకే అనుకునిసెప్పు, అన్నాడీడు. మీతో బేరాలేంటండీ, ఎంతోకొంతిచ్చి తోలుకుపోండీ - అన్నాడాడు. మరీ బంగారంలా సెబుతున్నావు రేటు - అన్నాడీడు బంగారమే కదండీ - అన్నాడాడు.

ఇలా వాళ్ళిద్దరూ సరసాలాడి, సరసాలాడి, సివరకి మూడువేలకి సెటిల్ చేశారు.

'మల్లేసుగారు నాకు ఎియ్యికి బొక్కెట్టేశారు,' అన్నాడు వాడు నేనిచ్చిన మూడువేలూ పంచెని ముడేస్తూ.

సంతనుంచి గేదెని తోలుకొస్తుంటే ఊళ్ళోవాళ్ళ కళ్ళన్నీ దానిమీదే . అది మెల్లగా ఏనుగునడిచినట్లు రోడ్డంతా ఆక్రమించి నడుస్తుంటే అందరూ 'ఇదెక్కడి గేదెరా' అని ఆశ్చర్యపోయారండి.

చీఫ్ మినిష్టరుగారు కాలవపక్క హావునంలో దిగినట్లు

అది మా పాకలో దిగి సగమాక్రమించేసిందండి. మాయావిడ ఊరోళ్ళదృష్టి పోయేందుకు ఓ కిలో మిరపకాయలు దిష్టితీసి, దాని ముందు గెడ్డెడేసి సెంబు తీసుకొని పితకడం మొదలు పెట్టింది. సెంబునిండింది; గిన్నెనిండింది; స్టీలుబిందె నిండింది - సెబితేనమ్మరుగాని ఆరోజు బకెట్టుపైన పాలిచ్చింది.

దాని మాటలు వింటూ నాకెప్పుడు కునుకుపట్టిందో తెలియదుగాని 'సచ్చాను బాబోయ్' అంటూ మా యావిడ పక్కమీదికొచ్చి పడేటప్పటికి మెలుకువొచ్చి, 'ఏమైందే' అన్నాను కంగారుగా.

'గేదె తన్నింది.' అంది ఏడుస్తూ.

'నిన్న రాత్రి బాగానే ఇచ్చిందికదే' అంటూ నేను వెళ్ళాను. 'ఏహేయ్' 'ఏహేయ్' అంటూ దాన్ని ముద్దు చేసి, దాని ముందు ఇంకొంచెం గెడ్డేసి, పొదుగుమీద సెయ్యేశానోలేదో ఫెడీమని నన్నుఊడా తన్నింది. 'సంపేసిందేవ్' అంటూ నేనెగిరి మాయవిడపక్కన పడ్డాను.

అయ్యా - అది ఇరవైనాలుగ్గంటలూ

మరి ఇంత బద్ధకం పనికిరాదు - సత్యవేణీ!



మాయావిడ ఆనందానికి పట్టపగ్గాల్లేవు. మూడువేలు పోయినా బంగారంలాంటి గేదె వచ్చినందుకు నాక్కూడా సాలా సంతోషవేసింది 'ఇన్నాళ్ళకి మా బోమ్మర్దేవ ఓ మంచిపని చేశాడు', అన్నాను మల్లేశుగాడి భుజం తడుతూ.

మంచయినా, సెడయినా - అంతా లక్కు, అన్నాడు మల్లేశుగాడు.

ఆ రాత్రంతా మాయావిడ గంటగటకి లేచి గేదె దగ్గర గెడ్డి పడేసి వచ్చింది. అది కూడా ఆపకుండా రాత్రి తెల్లార్లూ అలా నవులుతూనే వుందండి.

ఆ రాత్రంతా మాయావిడ మాట్లాడుతూనే వుంది. 'నువ్వు సిక్కిపోతన్నావు - రోజు పాలు తాగు,' అంది నాతో పిల్లలకి రోజు పెరుగు పొస్తానంది. వోటలుకి కాతా ఎడదావంది. ఇల్లాంటి గేదెలు నాలుగు, ఇంటిపక్క మునిసిపాలిటీ కొళాయి ఉంటే ఇంక కనకవర్షవే అంది. ఎప్పుడు తెల్లారుతుందా,మళ్ళా బకెట్టు ఎప్పుడు పితుకుదావా ' అనే ఆతృతతో దానికి నిద్రేపట్టలేదు.

వాములు వాములు తినేసేది గాని పొదుగు మీద సెయ్యేనిచ్చేది కాదండి.

'ఎంట్రా మల్లేశు - ఇది నన్నూ, నాఫామిలీన్ని తినేసేలా వుందికాని గిద్దెడు పాలివ్వడం లేదు,' అన్నాను దిగులుగా మా మల్లేశు గాడితో - నాలుగు రోజుల తర్వాత.

ఆడు జాగ్రత్తగా కొంచెం దూరంలో నిలబడి గేదెని దీక్షగా చూసి, 'ఇది గవర్నమెంటు గేదెలాగుందిరా బావా,' అన్నాడు.

'అదేంటి - నేనెప్పుడు ఇన్లేదే'

'ఈ టైపు గేదెలు అయిదేళ్ళకోసారి పాలిస్తాయిరా! ఆ తర్వాత తినడవేకాని పాలివ్వు. ఎంతో కొంతకి వదుల్చుకోటం బెటరు - తిండి కర్సైనా తప్పుతుంది,' అన్నాడువాడు.

'మరి కొనేవాడు పాలు పితికి సూసి కొంటానంటే'

'ఆ భయం నీకక్కర్లేదు - ఓనరు మారినప్పుడల్లా ఓసారి పాలిస్తుందిలే - నీకవ్వలే?' అన్నాడు మల్లేశుగాడు.

సివరికి ఎయ్యిరూపాయల నష్టానికి గవర్నమెంటు గేదె ఒదల్చుకున్నానండి.

కాని మాయావిడ సెప్పేలోకం తెలీని ఎర్రిమొకాన్ని కదండే - మల్లేశుగాడికి గేదె సంగతి ముందే తెల్సుననీ, వాడు రెండు పక్కలా కమీషను లాగేశాడనీ సాలా రోజుల వరకు తెలియలేదు. అది తెలిసాకా, దారికాపేసి ఆణ్ణి ఓ రోజు మునిమాపేళ పట్టుకున్నాను.

'ఏరా మల్లేశు - బావబావంటూ గుచ్చే గేదెనీ, సావదన్నే గవర్నమెంటు గేదెనీ నాకంట గట్టి తెల్ల సొక్కాలేసుకు కులుకుతున్నావా?' అన్నాను కాలరుచ్చుకుని.

'ఏంటా మోట సరసాలు - సొక్కా మాసిపోద్ది - వదులు' అని నా చేతులు సొక్కా మంచి తప్పించి, మడత సరిచేసి, ఉఫ్ ఉఫ్ అని ఊది- 'అది సస్తాదని గాని, ఇది గవర్నమెంటు గేదని గాని నాకు ముందు తెలీదు - నత్తెపెమాణం. కమీషనంటావా - రెండుబేరాల్లోనూ మూడొందలు కూడా కిట్టలేదు నా అర్జెంటు పన్లు వదులుకుని, నిన్ను సైకిలు మీద ఎక్కించి రిక్షాతొక్కినట్టు పాలెం, ఎడ్ల బజార్లు తిప్పినందుకయినా నాకు మూడొందలివ్వచ్చు. పోనీ అదీ యివ్వనంటావా - బావగారికి నేను ఆ మాత్రం పెట్టొచ్చు - తప్పులేదు. ఆ మూడొందలూ యిచ్చేస్తాగాని గుహప్రవేశానికి నువ్వు, నల్లెమ్మా తప్పకుండా రావాలి,' అన్నాడు మల్లేశుగాడు.

'గుహప్రవేశవేంటి?'

'ఇల్లు కడతన్నాను'

'స్తలవేది?'

'స్తలం కొంటన్నాను'

'డబ్బేదీ?'

'ఇదుగో,' అంటూ జాగ్రత్తగా నెత్తిమీద గంపదింపి దాన్ని కప్పిన టవలు తీసి సూపించాడు.

గంపలో వుందదీ. కోడిపుంజు - వుంజంటే వుంజుకాదు - సీమ కుక్కంతుందండి.

టవలు జాగ్రత్తగా కప్పి, 'చాలెంజి పుంజు - సిరంజీవిలాంటిది - ఎదురు లేదు - వువ్వుడు కోడివందేల దిబ్బకెడుతున్నాను. మనతాలుకా వోల్ మొత్తం ఓ ట్రిప్పేసేనంటే ఇల్లేకాదు - కారుకూడా కొనేస్తా. అప్పుడు నిన్నూ, సెల్లెమ్మనీ బీవారం సినిమాకి కార్లో తీసుకెడుతా,' అన్నాడు.

'ఆ గంప అక్కడెట్టు,' అన్నాను కరుగ్గా.

'అదేంటె - మా బావ అలా నక్సలైట్లా మాట్టాడతన్నాడు,' అన్నాడు ఆడు తెల్లబోయి.

'ఆ మూడొందలకి పుంజుకి సెల్లు,' అన్నాను.

'సాలా అన్నేయం - మూడొందలిచ్చి నా స్టేటుబేంకుని కొనేస్తున్నావు', అంటూ గోలపెట్టాడు మల్లేశుగాడు.

నోరిప్పితే తంతా,' అని ఆ గంపలాక్కుని కోడిపందేల దిబ్బకి బయలుదేరానండి.

కోడి పందేల దిబ్బ మీద మనపుంజు బయటికి తియ్యగానే అంతా సైలెన్సయి పోయింది. పెట్రొమాక్సులైట్లు కళ్ళుపెద్దవి చేసి నూసాయి. జనం ఎవడికీ నోటమాటరాలేదు. మల్లేశుగాడు ఓ మూల దిగులు మొహం పెట్టి సైలెంటుగా సూస్తూ కూర్చున్నాడు.

'ఛాలెంజ్‌రావుడొచ్చాడు - ఛాలెంజ్', అన్నాను పుంజును దింపి.

జనాల్లో మెల్లిగా కదలికొచ్చింది క్షణంలో పందేలూ, పై పందేలూ వందల నుంచి వేలకెళ్ళిపోయాయి. మనపుంజు మీదకి పోటీ రావడానికి ఎవుడూ సాహసించలేదు. సివరికి ఓడు ఛాలెంజందుకుని ఆడిపుంజుని బరిలోకి దింపాడు.

ఆడిపుంజు ఈకలూడిపోయి సన్నగా, సచ్చేలా వుందండి. మన పుంజయితే దానికేసి సూణ్ణయినా సూళ్ళేదండి.

అయ్యా - రెండుపుంజుల్ని మూడు సార్లు ముక్కుముక్కు తాకించి వదిలావండి. బక్కపుంజు వదిలీ వదలగానే కరాటీ కన్నడిలా గాలిలోకి ఎగిరి ఝుమ్మని ఎటాకిచ్చిందండి. అదింకా నేలమీద దిగకముందే, మల్లేసుగాడి పుంజు మెరుపులా జనాల కాళ్ళలోంచి దారి చేసుకుంటూ, సేలల్లోకి పరుగుతీసి సీకట్లో మాయమైపోయిందండి.

ఆరోజు సావు తప్పి కన్నులొట్టపోయి పదిహేనొందలు పోగొట్టుకున్నాను - బక్కపుంజుమీద మల్లేసుగాడు కాని ఐదువేలు గెల్చేశాడండి - ఆ తర్వాత తెల్సింది.

మర్నాడు పొద్దుటే మాత్రం ఏం తెలీనట్టు, 'అదేంట్రాబావా - మన పుంజు అలా పారిపోయింది. బరిలో నచ్చినా బావుండేది - వలావు చేసుకు తినేవోళ్ళంగదా' అని అవీఇవీ మాట్లాడి - 'ఒరే బావా - మల్లికావురం నుంచి గొల్లోడొచ్చాడురా - ఆడిదగ్గరుందిరా మేక - మేకంటే మేక కాదనుకో......

అలో.... అలో..... అదేంటి సార్ అలా పారిపోతన్నారు - ఊరేగింపు సూద్దావని మీరొస్తే రామాయణంలో పిడకలేటలా గేదెలు, కోళ్ళూ, మేకలూ అంటూ నా గోలేంటంటరా! ఎన్నికల్లో నెగ్గేసి మహారాజులా రదవెక్కి ఊరేగుతున్న గురూగార్ని సూస్తే మా గవర్నమెంటు గేదె గుర్తుకొచ్చి మొదలెట్టానండి. ఏంటోసార్ - నాకిందంతా ఎడ్లబజార్లానూ, ఆపెద్దమనుషులు దున్నపోతుని గేదె అని నమ్మించి అమ్మేసే మా మల్లేసులాంటి మాయగాళ్ళగాను అనిపిస్తోందండి.

ఏదో వానాకాలం సదువు సదివినోణ్ణి - మీలాగా యమ్మేలూ, బియ్యేలు సదివినోళ్ళకి సెప్పదగినోణ్ణి కాదుకాని, ఎంత ఎర్రిమొకన్నయినా యస్పీరియన్సు మీద నేను సెప్పేమాట తమరు ఆలకించండి - గవర్నమెంటు గేదెల్ని ఇల్లుగుల్లచేసుకుని మేపితే మేపండికాని పాలుమాత్రం ఆ సించకుడి - అడిగితే తన్నగలవు.

అబ్బే - ఇంకా గేదె ఊసెత్తనుండి - ఒట్టు - మీరు వెళ్ళిపోకండి - మళ్ళీ అయిదేళ్ళకో, అద్దాంతరంగానో కలుసుకుందాంగాని - మరినేవుంటా సార్!